సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
సోమవారం 30-12-2024
సంపుటి: 20 సంచిక: 235
పేజీలు: 4 వెల: రూ.1

## నల్లబ్యాడ్జీతో లాయర్ల నిరసన

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

అనంతపురం జిల్లా మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో న్యాయవాది శేషాద్రిని సివిల్ కేసు విచారణ పేరుతో త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వారు పిలిచి మానసిక క్షోభకు గురిచేయగా, ఆయన అక్కడే మృతి చెందారని, పోలీసుల దాష్టీకానికి ఇది పరాకాష్ట అని, పోలీసులపై కఠినచర్యలు తీసుకోవాలని జిల్లాబార్ సభ్యులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా బారో అసోసియేషన్ తరపున సోమవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిలారి ఈశ్వరరావు, జనరల్ సెక్రటరీ ఎగళ్ల ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీనియర్ జూనియర్ న్యాయవాదులు కంచరాన నాగభూషణరావు, ఎన్ని సూర్యారావు, నౌపాడ విజయ్ కుమార్, కొంక్యాన సుభాష్, పుప్పాల రంగబాబు, ఖస్పా ప్రతాప్‌చంద్ర, ఆరికతోట కృష్ణరాజు, ఆగూరు ఉమా మహేశ్వరరావు, మద్దుల మూర్తి, మహిళా న్యాయవాదులు ధవళ విజయలక్ష్మి, కొప్పిశెట్టి ఉషారాణి, పైడి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కోర్టు మెయిన్ గేట్ ముందు రోడ్డుపై మానవహారం నిర్వహించారు.



**భారత రాజ్యాంగంలో పేర్కొన్న ఐపీసీ, సీఆర్‌పీసీ, ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు అందరికీ ఒకటేనని చెబుతున్నా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాకు మాత్రం ప్రత్యేకమైన రాజ్యాంగం ఉందని ఈమధ్య కాలం వరకు ఇక్కడ రీజనల్ మేనేజర్‌గా పని చేసిన టీఆర్‌ఎం రాజు నిరూపించారు. బ్యాంకు విధివిధానాలు, వడ్డీరేట్లు వంటి వ్యవహారాల్లో వేర్వేరు బ్యాంకులకు వేర్వేరు నిబంధనలు, వేర్వేరు సూత్రాలు ఉండొచ్చు. కానీ అదే బ్యాంకు ఉద్యోగులు నేరం చేస్తే అనుసరించాల్సిన పద్ధతి మాత్రం రాజ్యాంగంలో పేర్కొన్న క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ మేరకే జరగాల్సి ఉంది. కానీ ఇక్కడ రీజనల్ మేనేజర్‌గా పని చేసిన రాజుకు తన బ్యాంకులో పైస్థాయిలో ఎవరి అండదండలున్నాయో తెలియదు గానీ, జిల్లాలో మాత్రం అప్పటి పోలీసు అధికారులను తప్పదోవ పట్టించి ఒక్క ముక్కలో చెప్పాలంటే తానే ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి ఎవరి మీద చర్యలు తీసుకోవాలో, ఎవరిని ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు పంపాలో, ఏ పత్రికలో ఏ కథనం వండివార్చాలో, ఎవర్ని జైలుకు పంపాలో అన్నీ టీఆర్‌ఎం రాజే చేశారనడానికి మరో తాజా సంఘటన ఉదాహరణగా నిలుస్తుంది.**







# రాజు గారి గారడి

- అప్పటి ఆర్.ఎం. చెప్పినట్లే ఆడిన పోలీసులు
- గార ఎస్‌బీఐలో మరో క్యాష్ ఆఫీసర్ సస్పెండ్
- ఏడాదిగా గోప్యంగా ఉంచిన అధికారులు
- పది రోజుల క్రితం సస్పెన్షన్ ఎత్తేసిన వైనం
- పోలీసులకిచ్చిన ఫిర్యాదులో కనబడని పేరు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

గార ఎస్‌బీఐ బ్రాంచిలో ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారు నగలు మాయమయ్యాయని, దీనిని అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేసిన స్వప్నప్రియే తస్కరించిందంటూ అప్పుడు ఆర్ఎంగా పని చేసిన టీఆర్‌ఎం రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో గార ఎస్ఐగా ఉన్న కామేశ్వరరావు గాని, ఇంత పెద్ద వ్యవహారాన్ని దగ్గరుండి పర్యవేక్షించాల్సిన డీఎస్పీ గాని, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా వ్యవహరించిన సీఐ గాని ఇందులో జోక్యం చేసుకోకుండా నేరుగా పోలీస్ బాసే రంగంలోకి దిగి టీఆర్‌ఎం రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటికే చనిపోయిన స్వప్నప్రియను మొదటి ముద్దాయిగా, ఆమె సోదరుడ్ని రెండో ముద్దాయిగా, నగలను ప్రైవేటు బ్యాంకుల్లో తాకట్టు పెట్టడానికి సహకరించిన తిరుమలరావును మరో ముద్దాయిగా చూపించి అప్పటికే పోలీసులకు ఇన్వెస్టిగేషన్‌లో సహకరిస్తున్న స్వప్నప్రియ సోదరుడ్ని రిమాండ్‌కు పంపేశారు. తాజాగా ఇదే కేసులో లోకనాథం అనే క్యాషియర్‌ను ఏడాది క్రితం సస్పెండ్ చేసినట్లు ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. **గార బ్రాంచిలో నగలు మాయమయ్యాయని, అందుకు స్వప్నప్రియే కారణమని ఫిర్యాదు చేసిన టీఆర్‌ఎం రాజు మరి గార క్యాషియర్ లోకనాథంను ఎందుకు సస్పెండ్ చేశారు?** ఏడాదిగా సస్పెన్షన్‌లో ఉన్న లోకనాథంపై పది రోజుల క్రితం సస్పెన్షన్‌ను ఎత్తివేసి స్థానిక రీజనల్ మేనేజర్ కార్యాలయంలో కూర్చోబెట్టారు. టీఆర్‌ఎం రాజు అప్పట్లో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఎక్కడా లోకనాథం పేరు లేదు. కానీ గార బ్రాంచిలో ఘటన జరిగిన పది రోజుల తర్వాత ఆయన్ను సస్పెండ్ చేస్తూ బ్యాంకు అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఏడాది కాలంలో ఎక్కడా లోకనాథం పేరు అటు పోలీసుల విచారణలో గాని, ఇటు బ్యాంకు అధికారుల ఎంక్వైరీలో గాని లేకపోవడం కొసమెరుపు. గార బ్యాంకులో ఉండాల్సిన తాకట్టు నగలు మాయమైన కేసులో లోకనాథంను సస్పెండ్ చేస్తున్నామంటూ పేర్కొన్న బ్యాంకు అధికారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో లోకనాథం పేరు ఎందుకు చేర్చలేదన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. **గార ఎస్‌బీఐ కుంభకోణంలో లోకనాథం పాత్ర లేదు అని భావించే పోలీసులకు ఫిర్యాదు చేయలేదు అని భావిస్తే ఆయన్ను ఎందుకు సస్పెండ్ చేసినట్లు? ఏడాది పాటు ఉద్యోగం ఇవ్వకుండా ఎందుకు విధులకు దూరం పెట్టినట్టు? లేదా లోకనాథం పాత్ర కూడా ఉందీ అంటే పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అప్పటి ఆర్ఎం రాజు ఈ పేరు ఎందుకు ఇవ్వలేదు?** దీనికి టీఆర్‌ఎం రాజు సమాధానం చెప్పినా ఫర్వాలేదు, లేదా ఎస్‌బీఐ ఏజీఎం సమాధానమిచ్చినా అభ్యంతరంలేదు. ఎందుకంటే.. టీఆర్‌ఎం రాజు హయాంలో గార బ్రాంచిలో తాకట్టు

- మిగతా 4లో





# కంప్లైంట్ చేశారో.. ఖతం చేస్తాం!

### - మహిళను గాయపర్చి వార్నింగ్ ఇచ్చిన రౌడీమూక -





**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

మురపాకకు చెందిన లింగాల అప్పమ్మ (52) అనే మహిళను తీవ్రంగా కొట్టి గాయపర్చడమే కాకుండా పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపేస్తామంటూ వార్నింగ్ ఇచ్చిన రౌడీ గ్యాంగ్ వ్యవహారం సోమవారం వెలుగులోకి వచ్చింది. నగరంలో కొన్నేళ్లుగా తాము డాన్‌లమంటూ చెలరేగిపోతూ ఎక్కడికక్కడ హింసకు పాల్పడుతున్నా ఇంతవరకు వీరి మీద రౌడీషీట్‌లు లేకపోవడంతో తాము నిజంగానే డాన్‌లమని భావిస్తున్న నగరానికి చెందిన సల్మాన్, ఎర్రయ్యలపై వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక టౌన్‌హాల్ సందులో ఉన్న శ్రీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమానికి మురపాకకు చెందిన లింగాల అప్పమ్మ వచ్చారు. పక్క ఊరి నుంచి శ్రీ ఫంక్షన్‌హాల్‌కు రావడానికి దారి తెలియదని ఆమె సమీప బంధువు ఒకరు పేర్కొనడంతో పాత బస్టాండు వద్ద ఉన్న సూర్యలింగం ఆసుపత్రి వద్ద ఆమె వారికోసం ఎదురు చూస్తున్నారు. ఈలోగా ఫుల్‌గా మందుకొట్టి బండిపై వచ్చిన సల్మాన్, ఎర్రయ్యలు టూవీలర్ స్కిడ్ అవడంతో పడిపోయారు. తాము పడిపోవడానికి లింగాల అప్పమ్మ పక్కనే ఉన్న ఆమె చెల్లి కొడుకు కిరణ్(27)యే కారణమని, మద్యం మత్తులో వంశీ ముక్కును పగలగొట్టేశారు. దీంతో పక్కనే ఉన్న అప్పమ్మ వీరిని తిట్టడంతో అరచేతికి ఉన్న కడియంతో అప్పమ్మ కణత మీద, మొహం మీద తీవ్రంగా గాయపర్చారు. ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపేస్తామని వార్నింగ్ ఇస్తూ వెళ్లిపోయారు. చుట్టుపక్కల జనసంచారం ఉన్నా ఈ రౌడీలు చెలరేగిపోవడాన్ని ఎవరూ అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. అప్పటికే కిరణ్‌కు ముక్కు నుంచి రక్తం కారుతుండటం, అప్పమ్మకు మొహమంతా చీరుకుపోయివుండటంతో ఆదివారం రిమ్స్‌కు వెళితే.. ట్రీట్మెంట్ మరింత ఆలస్యమవుతుందని భావించి డే అండ్ నైట్ వద్ద ఉన్న ఓ ఆసుపత్రిలో ప్రాథమికంగా చికిత్స పొందారు. సోమవారం ఉదయం వచ్చి రిమ్స్‌లో ఎమ్మెల్సీకి అడ్మిట్ చేసుకోవాలని కోరితే, ఆదివారం జరిగిన ఘటనకు సోమవారం చేర్చుకోమంటూ వెనక్కు పంపేశారు. దీంతో బాధితురాలు అప్పమ్మ సోమవారం ఎస్పీ గ్రీవెన్స్‌కు వెళ్లడానికి సిద్ధపడ్డారు. ఈలోగా వన్‌టౌన్ నుంచి కబురు రావడంతో అక్కడకు వెళ్లారు. మరో బాధితుడు కిరణ్ విశాఖపట్నంలో ఉంటున్నాడు. జరిగిన సంఘటనను పోలీసులకు చెబితే చంపేస్తామని బెదిరించడంతో ఆయన అట్నుంచటే విశాఖపట్నం వెళ్లిపోయి ఫోన్ స్విచాఫ్ చేసినట్టు తెలుస్తుంది.

• ఎడిటోరియల్

# కనీస 'మద్దతు' అవసరం

మాటల్లో ఊరేగించి, చేతల్లో ఉరి బిగించే విధానాలతో అన్నదాతల ఉసురు పోసుకోవటం పాలకులకు పరిపాటిగా మారింది. రైతు దేశానికి వెన్నెముక అంటూ ఉపన్యాసాలు ఊదరగొట్టే ప్రభుత్వాలు ఆ వెన్నెముకను కర్కశంగా విరిచేసే చేతలకు తెగిస్తున్నాయి. చేసిన శ్రమకు, ఉత్పత్తికి కనీసంలో కనీసంగా ఖరీదు కట్టటం అనేది ఒక సాధారణ న్యాయం. కానీ, ఈ సాధారణ న్యాయం దశాబ్దాల తరబడి రైతులకు అందటం లేదు. పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలన్న అంశానికి చట్టబద్ధత కల్పించటం ఇంకా ఎండమావిగానే ఉంది. కేంద్రంలోని బిజెపి తాను అమలు చేస్తామని అనేకసార్లు వల్లించిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి తదితర 11 డిమాండ్లతో ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళన కొనసాగుతోంది. రైతు నాయకుడు జగ్జిత్‌సింగ్ దల్లేవాల్ నవంబరు 26న నిరాహార దీక్ష చేపట్టి నెలరోజులు గడిచిపోయినా కేంద్ర ప్రభుత్వ పెద్దల్లో కనీస చలనం లేకపోవటం శోచనీయం. ఎండనక వాననక ఆరుగాలం చెమటోడ్చి కష్టించే అన్నదాతలకు ప్రకృతి వైపరీత్యాలతో ఎదురయ్యే సమస్యలు అన్నీ ఇన్నీ కావు. వాటికి అదనంగా దళారుల మోసాలు, మార్కెట్ ధర పతనాలు, రవాణా భారాలూ చేరి, కష్టాలూ కన్నీళ్లే దిగుబడులుగా వ్యవసాయాన్ని వ్యయభరితంగా మార్చేశాయి. ఈ దుర్భర స్థితి నుంచి రైతును రక్షించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కష్టాలను మరింత పెంచుతున్నాయి తప్ప, భరోసాగా నిలవటం లేదు. దరిమిలా దేశంలో గత మూడు దశాబ్దాల్లో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఇటీవల సుప్రీంకోర్టు తనకందిన అధికారిక నివేదిక నుంచి పేర్కొంది. నివేదికలకెక్కని చావులను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ ఆత్మహత్యల లెక్క ఏడు లక్షలకు పైబడే ఉంటుందని పరిశీలకుల అంచనా. వ్యవసాయమొక ప్రధాన జీవనరంగంగా సాగుతున్న దేశంలో రైతుల పరిస్థితి ఇంత దుర్భరంగా ఉండడం చాలా బాధాకరం. కేంద్ర ప్రభుత్వం రైతుల కష్టాలను తీర్చకపోగా ఎరువుల ధరలను పెంచి, సహకార వ్యవస్థలను, మార్కెట్టు యార్డులను నిర్వీర్యపర్చి మరిన్ని ఇక్కట్లను జోడించింది. వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయటపడటానికి గతంలో స్వామినాథన్ కమిషన్ కొన్ని సిఫార్సులు చేసింది. పంటలకు మద్దతు ధర (సి2 + 50 శాతం)ను ఇవ్వాలని, సింగిల్ యూనిట్ ప్రాతిపదికన పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని, రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని, మార్కెట్ సదుపాయాలు పెంచాలని సూచనలు చేసింది. దశాబ్దం క్రితం వరకూ అధికారంలోకి రాక ముందు బిజెపి బలంగా వినిపించిన ఎన్నికల వాగ్దానాల్లో ఇవన్నీ ఉన్నాయి. గద్దెనెక్కాక ఆ హామీలను ఆవలకు విసిరేసి, రైతులకు పంగనామాలు పెట్టే పనికి సమాయత్తమైంది! ఉన్న రాయితీలను తీసేసి, మూడు చట్టాలను తీసుకొచ్చి, కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే దుస్సాహసానికి ఒడిగట్టింది. వాటిని వెనక్కి కొట్టటానికి లక్షలాది మంది రైతులు నెలల తరబడి, ఢిల్లీ సరిహద్దుల్లో చారిత్రాత్మక పోరాటం చేశారు. తప్పని పరిస్థితుల్లో మోడీ క్షమాపణలు చెప్పి, ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ, ఆ తర్వాత ఈ మూడేళ్లలో రైతులను ఉద్ధరించే చర్య ఒక్కటంటే ఒక్కటీ చేపట్టలేదు. ఏడాదికి మూడు విడతలుగా విదిల్చే రూ.6 వేల సహాయాన్నే గొప్ప ఉపకారంగా మోడీ పరివారం చెప్పుకుంటోంది. ఇలాంటి అరకొర విదిలింపులతో దేశ వ్యవసాయ రంగానికి ఒరిగేది ఏమీ ఉండదు. రైతు సమస్యలపై అధ్యయనం చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇటీవల విడుదల నివేదిక కూడా దీనినే స్పష్టం చేస్తోంది. కనీస మద్దతు ధరకు గ్యారంటీ, రుణమాఫీ, పిఎం కిసాన్ నిధుల రెట్టింపు, బడ్జెట్లో వ్యవసాయ రంగ వాటా పెంపు వంటి ప్రతిపాదనలు చేసింది. మోడీ ప్రభుత్వం తాను చెప్పుకుంటున్నట్టు రైతులకు ఇప్పటికే చాలా మేళ్లు చేసివుంటే.. కొత్తగా ఈ ప్రతిపాదనలు ఎందుకు? రైతాంగం పట్ల కత్తి కట్టినట్టు వ్యవహరించే ధోరణికి బిజెపి ప్రభుత్వం ఇకనైనా స్వస్తి పలకాలి. రైతుల న్యాయమైన డిమాండ్లను తక్షణం నెరవేర్చాలి. భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే ఉదారవాద ఆర్థిక విధానాలను విడనాడాలి. రైతు నిశ్చింతగా ఉండటానికి, వ్యవసాయరంగం నిలబడటానికి ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలుచేయాలి. స్వదేశీ అపరాల కొనుగోలుకు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ముడి వంటనూనెలు ప్రతిబంధకంగా మారాయని, వాటి దిగుమతి మీద సుంకాలు విధించినా దేశీయంగా గిట్టుబాటు ధర లభించడంలేదు. ఇటువంటి చోట ప్రభుత్వమే కల్పించుకొని కనీస మద్దతును రైతుకు అందేలా చూడాలి.



బీస్ విద్య.. తీస్ లక్ష్మి.. ఇది ఎక్కువమంది విషయంలో నిజం కావచ్చుగానీ.. ఇది మాత్రమే నిజం ఏమాత్రం కాదని నిరూపించింది థంకమ్మ. 74 ఏళ్ల వయస్సులో యువతీ, యువకులతో కలిసి ఫైనాన్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పాఠాలపై చర్చిస్తోంది. రిటైర్డ్ మెంట్ వయస్సు కూడా దాటాక గెస్ట్ ప్రొఫెసర్ గా మళ్లీ జాయినైందేమో అని మీరనుకోవచ్చు.. కానీ, ఆమే ఓ స్టూడెంటే. కేరళ ఎర్నాకులం వీసాట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అందుకు ఓ వేదిక. అక్కడి విశాలమైన క్యాంపస్ కు వెళ్లినవారెవ్వరైనా 74 ఏళ్ల వయస్సులో బిజీబిజీగా కాలేజ్ అసైన్మెంట్స్ పై చర్చల్లో గడిపే థంకమ్మను చూస్తే ఆశ్చర్యపోతారు. ఆమే ఓ విద్యార్థి అని తెలిశాక లవ్‌లో పడిపోతారు.

# మనసుంటే.. వయసుతో పనేముంది!



ప్రస్తుతం బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ మొదటి ఏడాది చదువుతున్న థంకమ్మ కుంజప్పన్.. 73 ఏళ్ల వయస్సులో తన ప్లస్ టూ పూర్తి చేసింది. తమ ఊరు ఎలంజి గ్రామపంచాయితీ పరిధిలోనే థంకమ్మ కుంజప్పన్ ఇప్పుడు అక్కడి యువతీ, యువకులందరికీ ఓ రోల్ మాడల్!

థంకమ్మకు 13 ఏళ్లకే మైనర్ బాలికగా ఉన్నప్పుడు పెళ్లైపోయింది. చదువుకోవాలనే మమకారమున్నా.. తన వివాహం కారణంగా చదువును వదిలేయాల్సి వచ్చింది. ఆ తర్వాత కొద్దిరోజులకు భర్త తనను వదిలేశాడు. ఓ కొడుకు, మరో కుమార్తె. ఇద్దరినీ పెంచడం థంకమ్మకు ఓ సవాల్ గా మారింది. తన పిల్లలను పెంచి పెద్దచేసి బాగా చదివించేందుకు ఆమె రకరకాల కూలీ పనులు చేసింది. ఇక ఆమెపై బరువైన బాధ్యతలు పడటంతో చదువుకోవాలనే మనసున్నా అది కాస్తా పక్కకుపోయింది. ఇప్పుడు పిల్లలు పెద్దవారై ఎవరి జీవితం వారు చూసుకుంటున్న సమయంలో థంకమ్మ మళ్లీ చదువుకోవాలన్న తన పాత కోరికను బయటకు తీసింది. అలా 71 ఏళ్లకు ఎస్సెఎస్సెల్సీ పూర్తి చేసింది. ఆమె మంచి ఉత్తీర్ణత సాధించడంతో పట్టుదల మరింత పెరిగింది. దాంతో చదువును కొనసాగించింది. 73 ఏళ్లకు ప్లస్ టూ పూర్తి చేసిన థంకమ్మ ఇప్పుడు 74 ఏళ్ల వయస్సులో బీకామ్ గ్రాడ్యుయేషన్ చేస్తోంది.

బాగా చదువుకోవాలనకోవాలన్నది చిన్ననాట్నుంచీ తన కల అంటుంది థంకమ్మ. అందుకే, నాకు వయస్సు అడ్డుకాలేదని ఒకింత గర్వంగా చెబుతుంది. నేర్చుకోవడానికి జీవితంలో వయస్సెప్పుడూ అడ్డంకి కాదని నిరూపించాలనుకున్నానంటోంది.

తన భర్త కుంజప్పన్ తనను విడిచి వెళ్లిపోయిన రోజున తన ప్రపంచమే కుప్పకూలిపోయిందని తన చేదు జ్ఞాపకాలను యాజ్జేసుకుంది థంకమ్మ. చాలాకాలం తన వ్యథ ఎవ్వరికి చెప్పాలో తెలియక.. ఏం చేయాలో తోచక.. ఏడ్చీ ఏడ్చీ కన్నీళ్లన్నీ ఆవిరైపోయాయి. కానీ, ఏడిస్తే లాభం లేదు. మిగిలేది బాధే తప్ప ఇంకేమీ రాదు. చూస్తే పిల్లల కొండంత బాధ్యత భుజస్కంధాలపై ఉంది. అలాంటి సమయంలో మొక్కవదలని ఆత్మస్థైర్యంతో తనకు వచ్చిన పనల్లా చేసుకుంటూ పిల్లల్ని పెంచానంటోంది. వారు సెటిలైపోయాక.. ఇప్పుడు మళ్లీ తన పుస్తకాల దుమ్ముదులిపి చదువుల్లో రాణించడం.. కాలేజీలో యువతీ, యువకులతో కలిసి పాఠాలు వినడం ఒకింత థ్రిల్లింగ్‌గా ఉందంటోంది థంకమ్మ.

తనకు అవకాశం కల్పించిన వీసాట్ కళాశాల యాజమాన్యానికీ, తన ఏజ్ గ్రూప్‌తో సంబంధం లేకున్నా మనవలు, మనవరాళ్ల వయస్సులో ఉండి కూడా తనకు ప్రోత్సాహమందిస్తున్న తన కాలేజ్ మేట్స్‌కి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతోంది ఈ 74 ఏళ్ల బాలిక. అవునూ, నిజంగానే థంకమ్మ ఇంకా బాలికే. ఎందుకంటే తన చదువును గ్రాడ్యుయేషన్ వరకే పరిమితం చేయకుండా.. ఇంకా పీజీ వంటివి చేయాలని తీర్మానించుకుంది. తనకు ఆసక్తి ఉన్న రంగాల్లో ముందుకెళ్లాలన్న సంకల్పాన్ని తనకుతాను విధించుకుంది. మొత్తంగా నేర్చుకోవడం అనే ఒక ప్రక్రియ జీవితంలో ఎప్పుడూ ఆగిపోకూడదనే ఓ సందేశానికి నిలువెత్తు ఉదాహరణై నిలుస్తోంది ఈ ఎర్నాకులం 74 ఏళ్ల నవ యువతి.

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

# డాకూ మహారాజ్..ట్విస్ట్‌లే ట్విస్ట్‌లు!

2024లో నందమూరి బాలకృష్ణ నుంచి సినిమాలేం రాలేదు. ఈ విషయంలో బాలయ్య ఫ్యాన్స్ కాస్త నిరుత్సాహంగా ఉన్నారు. అయితే అన్‌స్టాపబుల్‌తో.. ఫ్యాన్స్‌ని కాస్త సంతృప్తి పరచగలిగారు బాలయ్య. 2025 సంక్రాంతి సీజన్‌లో బాలయ్య హంగామా కనిపించబోతోంది. ఆయన డాకూ మహారాజ్‌గా ఎంట్రీ ఇవ్వబోతున్నారు. జనవరి 12న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ప్రమోషన్స్ మొదలైపోయాయి. ఈ సినిమా గురించి అటు నిర్మాత నాగవంశీ, ఇటు దర్శకుడు బాబీ చాలా గొప్పగా చెబుతున్నారు. వాళ్ల మాటలు వింటుంటే అంచనాలు మరింతగా పెరిగిపోతున్నాయి. డాకూ మహారాజ్‌ని ఇంత వరకూ యాక్షన్ మూవీగానే ప్రమోట్ చేస్తూ వచ్చారు. అయితే ఇందులో ట్విస్టులు థ్రిల్లింగ్ గా ఉండబోతున్నాయట. సినిమా మొత్తమ్మీద మూడు ట్విస్టులు ఉంటాయని, అవన్నీ కథని కొత్త కోణంలో చూపించబోతున్నాయని తెలుస్తోంది. ఈ సినిమాలో పాప క్యారెక్టర్‌కు చాలా ప్రాధాన్యం ఉంది. ఈ పాప ఎవరు? అనే క్వశ్చన్ మార్క్ అందరిలోనూ ఉంది. ఆ పాప ఎవరన్న విషయాన్ని రివీల్ చేయడమే ఈ సినిమాలో అతి పెద్ద ట్విస్ట్ అని సమాచారం. బాలయ్య పాత్రలో భిన్నమైణ కోణాలు ఒకొక్కటిగా బయటకు రావడం కూడా చాలా థ్రిల్లింగ్ గా ఉండబోతున్నాయన్న టాక్ వినిపిస్తోంది. ఇప్పటికి ఈ సినిమా నుంచి 2 పాటలు వచ్చాయి. మూడో పాట జనవరి 4న రాబోతోంది. ఆ పాట మాస్‌కు బాగా నచ్చేలా ఉండబోతోందని, ఇందులో బాలయ్య వేసే స్టెప్పులు.. కొత్త పంథాలో ఉంటాయని తెలుస్తోంది. రెండు పాటల్లో బాలయ్యలో ఎనర్జీ చూసే అవకాశం రాలేదు. మూడో పాట ఆ లోటు తీర్చబోతోందన్నమాట.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...






# నైజీరియాలో పెరిగిన హాట్ బ్యూటీ!

బాలీవుడ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే టాలీవుడ్‌కి సుపరిచితమే. యారియాన్ 2తో బాలీవుడ్‌లో లాంచ్ అయిన అమ్మడు చందు చాంపియన్‌తో మరింత ఫేమస్ అయింది. దీంతో టాలీవుడ్‌కి ప్రమోట్ అయింది. మిస్టర్ బచ్చన్‌లో మాస్ రాజా రవితేజకి జోడీగా నటించింది. కానీ తొలి సినిమా ఫ్లాప్ ఇచ్చినా నటిగా పాస్ అయింది. వచ్చిన అవకాశంతో ట్యాలెంటెడ్‌గా నిరూపించుకుంది. దీంతో సొగసరికి మరో రెండు అవకాశాలు వరించాయి. ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉంది. మరి ఈ బ్యూటీ ఎక్కడ పుట్టి పెరిగిందో తెలుసా? అమ్మడు ఔరంగాబాద్ లో పుట్టింది. కానీ పెరగడమంతా నైజీరియాలో. ఇంటర్మీడియట్ వరకూ నైజీరియాలోనే స్కూలింగ్ పూర్తి చేసింది. అటుపై ముంబై షిఫ్ట్ అయిందిట. ఆ సమయంలోనే చదువుకుంటూనే మోడలింగ్ మొదలు పెట్టినట్లు తెలిపింది. డెయిరీమిల్క్ యాడ్‌తో మంచి పేరు రావడంతో అమ్మడికి సినిమా ఛాన్సులు వచ్చినట్లు వెల్లడించింది. సాధారణంగా ధనవంతులంతా అభివృద్ధి చెందిన దేశాల్లో చదువుకుంటారు. అక్కడే స్థిరపడటానికి చూస్తారు. కానీ భాగ్యశ్రీ మాత్రం ఆర్థికంగా వెనుకబడిన దేశంలో స్కూలింగ్ పూర్తి చేయడం అన్నది ఇంట్రెస్టింగ్. అదీ భారత్ ముంబై నుంచి నైజీరియా వెళ్లడం విశేషం. మరి ఆ ప్రయాణం వెనుక ఇంకేదైనా స్టోరీ ఉందా? అన్నది తెలియాలి. ఇక టాలీవుడ్‌లో భాగ్య శ్రీ లైనప్ చూస్తే ప్రస్తుతం దుల్కర్ సల్మాన్, రానా నటిస్తోన్న కాంత..లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఇది భాగ్యశ్రీకి రెండవ సినిమా. ఇటీవలే మూడవ ప్రాజెక్ట్ కూడా ఖాతాలో వేసుకుంది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ ఓ సినిమా నిర్మిస్తుంది. ఇందులో రామ్ కి జోడీగా భాగ్యశ్రీని ఎంపిక చేసారు. ఈ రెండు సినిమా విజయాలు అమ్మడకు కీలకం కానున్నాయి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# అంజలి సినిమాలో నిజమైన 'గేమ్ ఛేంజర్'



రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన గేమ్ ఛేంజర్ సినిమా విడుదలకు సిద్ధం అయ్యింది. దిల్‌రాజు ఈ సినిమాను దాదాపుగా రూ.300 కోట్ల బడ్జెట్‌తో నిర్మించారు. దిల్ రాజుకు ఈ సినిమా అత్యంత కీలకం అనే విషయం తెల్పింది. దిల్ రాజు బ్యానర్‌లో ఇప్పటి వరకు వచ్చిన సినిమాల్లో అత్యధిక బడ్జెట్ సినిమాగా ఈ సినిమాను చెబుతున్నారు. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న శంకర్ గత పాత సినిమాలను పోలి గేమ్ ఛేంజర్ ఉంటుంది అని, ఇండియన్-2 సినిమాతో ఈ సినిమాకు అస్సలు పోలిక ఉండదు అంటూ దిల్ రాజుతో పాటు ఇతర యూనిట్ సభ్యులు బల్లగుద్ది మరీ చెబుతున్నారు. ఈ సినిమాలో రామ్‌చరణ్ డ్యూయెల్ రోల్‌లో కనిపించబోతున్నాడు. తండ్రి కొడుకుగా మొదటిసారి చరణ్ డ్యూయెల్ రోల్ చేసిన నేపథ్యంలో అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. అంచనాలకు తగ్గట్లుగా దర్శకుడు శంకర్ ఈ సినిమాను రూపొందించారు. చరణ్‌కి జోడీగా ఈ సినిమాలో ఇద్దరు ముద్దుగుమ్మలు నటించారు. తండ్రి పాత్రలో కనిపించిన చరణ్‌కి జోడీగా తెలుగు అమ్మాయి అయిన అంజలి నటించగా కొడుకు పాత్రలో నటించిన చరణ్‌కు జోడీగా కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించింది. ఈ రెండు జంటలకు మంచి స్పందన వస్తుందని చిత్ర యూనిట్ సభ్యులు మొదటి నుంచి చెబుతూ వస్తున్నారు. అంజలి ఈ సినిమాలో అత్యంత కీలక పాత్రలో కనిపించబోతుంది అంటూ యూనిట్ సభ్యులు చెబుతున్నారు. సెకండ్ హాఫ్‌లో వచ్చే సన్నివేశాల్లో అంజలి పాత్రకు చాలా వెయిట్ ఉంటుంది అంటున్నారు. ఒక విధంగా చెప్పాలి అంటే సినిమాలో ఆమె గేమ్ ఛేంజర్ అంటున్నారు. అంటే కథ మొత్తం ఆమె వల్ల టర్న్ అవుతుంది, సినిమా మొత్తం ఆమె చుట్టూ తిరుగుతుంది. కనుక అంజలి కనిపించిన కొద్ది సమయం అయినా చాలా స్ట్రాంగ్ పాత్రతో కనిపించబోతుంది అంటూ సమాచారం అందుతోంది. ఈ మధ్య కాలంలో అంజలి లేడీ ఓరియంటెడ్ సినిమాలు ఎక్కువగా చేస్తుంది. చాలా కాలం తర్వాత స్టార్ హీరోకు జోడీగా నటించింది. కియారా అద్వానీ కాలేజ్‌లో చరణ్ స్నేహితురాలిగా కనిపించబోతుంది. ఆమె పాటలకు పరిమితం అయినా అంజలి మాత్రం నటనకు ఆస్కారం ఉంటుంది అంటున్నారు. కచ్చితంగా అంజలి పాత్ర సినిమాకు బలం అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారు. అన్ని విధాలుగా ఈ సినిమాపై అంచనాలు పెంచే విధంగా చిత్ర యూనిట్ సభ్యులు ప్రచారం చేస్తున్నారు. జనవరి 1న సినిమా ట్రైలర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. ఇక సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ విషయమై నేడు పవన్ కళ్యాణ్‌ను నిర్మాత దిల్ రాజు కలువబోతున్నాడు. ఏపీలోనే సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఉండే అవకాశాలు ఉన్నాయి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



వెనకటికి రాజుల కాలంలో రాజుల పిల్లలకు పాఠాలు చెప్పాలంటే అయ్యవార్లకు నిలువెల్లా వణుకు పుట్టేది. వారిని కొట్టకూడదు. కనీసం తిట్టకూడదు. దాంతో వారు ఏ హొమ్ వర్కో చేసుకురాకపోయినా క్లాసులో అల్లరి చేసినా వారిని కొట్టాల్సి వచ్చినప్పుడు వారి బదులు వేరే పిల్లలను కొట్టేవారట. కొన్ని రాజ్యాల్లో అయితే యువరాజులు, యువరాణుల వయసున్న అద్దె పిల్లలను క్లాసుల్లో వారి పక్కన సిద్ధంగా ఉంచేవారట. అయ్యవారి చేతిలో అనవసరంగా చావు దెబ్బలు తింటారెందుకు? ఆయన చెప్పిందేదో చేయొచ్చుగా? అని యువరాజులుంగారు, యువరాణులుంగారు ఈ దెబ్బలు తినే పిల్లలను అమాయకంగా అడుగుతుంటే వారికి పుండుమీద కారం పూసినట్లు ఉండేదట.

# దెబదెబ దెబ్బలు పడతయ్ రో!

బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై కర్ణాటకలో మాజీ ఐపీఎస్ అధికారి. ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి ఇష్టపూర్వకంగా సొంతరాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చారు. చిన్నప్పుడు వెనకటి అద్దె పిల్లల్లా దెబ్బలు తిన్న అనుభవం ఆయనకు ఉండి ఉండకపోవచ్చు. కానీ ఆధునిక కాలంలో ఆయన పురాతన శిక్షాస్మృతిని తనమీద తనే అమలు చేసుకోవడం మాత్రం బాగలేదు. ఆ దెబ్బలు మనకు తగులుతున్నట్లుగా బాధగా ఉంది. ఒకరిని కొట్టడం ఎంతనేరమో మనల్ను మనం కొట్టుకోవడం కూడా అంతే నేరం. తమిళ సంప్రదాయంలో ప్రాయశ్చిత్తానికి ఇలా కొరడాతో తనను తాను శిక్షించుకోవడం ఉందని ఆయన వివరణ ఇచ్చుకున్నారు.

ఈ బుగ్గ నుండి ఆ బుగ్గలోకి, నాలుకమీద ఇనుప చువ్వలు గుచ్చుకోవడం, భుజాలకు కొక్కేలు తగిలించుకుని దేవుడి కావళ్ళు మోయడం, వీపుకు ఇనుప కొక్కేలు తగిలించుకుని సుబ్రహ్మణ్యస్వామి రథాలు లాగడం నిప్పులు తొక్కుతూ మొక్కులు చెల్లించుకోవడం, దేవుడి విగ్రహాలున్న పెట్టెలు మోస్తూ కొరడాతో కొట్టుకోవడం ఇలా భక్తిలో ఎన్నెన్నో అన్ని ప్రాంతాల్లో ఉన్నాయి. తమిళనాడులో ఇంకా ఎక్కువున్నాయి.




చెన్నై, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంజనీరింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అన్నా విశ్వవిద్యాలయంలో జరిగిన ఘటనకు ప్రభుత్వ భద్రతా వైఫల్యమే కారణమంటూ, ఇందుకు నిరసనగా శుక్రవారం అన్నామలై కొరడాతో ఆరుసార్లు కొట్టుకున్నారు. ... దరించి, నుదుట విభూతి రేఖలు దిద్దుకుని పార్టీ కార్యకర్తల సమక్షంలో కొరడాతో కొట్టుకున్నారు. ఆ సమయంలో ఆయన చుట్టూ చేరిన పార్టీ శ్రేణులు 'వెట్రివేల్.. వీరవేల్' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

తమిళ సంప్రదాయంలో భాగమే: అన్నామలై

అన్నామలై విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నిరసన తమిళ సంప్రదాయంలో భాగమేనని అన్నారు. బీజేపీ కార్యకర్తలెవరూ తనను అనుసరించరాదని విజ్ఞప్తి చేశారు. మహిళా లోకానికి జరుగుతున్న అన్యాయాల ను నిరోధించాలని తమిళుల ఆరాధ్య దైవమైన మురుగప్పెరుమాన్‌ను వేడుకోవటంలో భాగంగానే మండలం పాటు వ్రతం ఆచరిస్తున్నట్లు చెప్పారు.

పూర్వం రాజాస్థానాల్లో శిక్ష ప్రారంభం కొరడా దెబ్బలతోనే. నేర తీవ్రతను బట్టి కొరడా దెబ్బల సంఖ్య పెరుగుతూ పోతుంది. వేలు తీసేయడం, చెయ్యి నరకడం, కాలు నరకడం, నాలుక కోసేయడం, చెట్టుకు కట్టి కొట్టడం, గుండు కొట్టించి సున్నపు బొట్లు పెట్టి గాడిద మీద ఊరేగిస్తూ మెడలో చెప్పుల దండ వేయడం లాంటి ఎన్నెన్నో శిక్షలు ఉండేవి.

ఇంగ్లిష్ వాడు వచ్చాక న్యాయస్థానం కనుక్కోలేని విధంగా పైకి కనపడని దెబ్బలు కొట్టే ఒక సునిశిత విద్య వెలుగులోకి వచ్చింది. ఆ విద్య పోలీసుల చేతిలో ఇప్పటికీ మెరుగులు దిద్దుకుంటూనే ఉందని అనుభవజ్ఞులు చెబుతుంటారు.

అలాంటి పోలీసు వృత్తి నుండి రాజకీయాల్లోకి వచ్చిన అన్నామలై కొరడాతో తనను తాను శిక్షించుకోవడం నలభై రోజులపాటు చెప్పులు వేసుకోకుండా తిరుగుతానని దీక్ష తీసుకోవడం ఎలా అర్థం చేసుకోవాలో తెలియక లోకం తికమకపడుతోంది. చెన్నయ్ మహానగరంలో అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఒక విద్యార్థిని అత్యాచారానికి గురయ్యిందని తమిళనాడులో అమ్మాయిలకు రక్షణ కరువయ్యిందని బాధతో ఏమి చేయాలో తెలియక అన్నామలై తనను తాను కొరడాతో కొట్టుకున్నట్లున్నారు.

ప్రజాస్వామ్యంలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి సవాలక్ష మార్గాలున్నాయి. అంత చదువుకుని, అనేక చోట్ల జిల్లా ఎస్పీగా పనిచేసిన అన్నామలైకి ఆ విషయం తెలియక కాదు. తమిళనాడులో అర్జంటుగా స్టాలిన్ ప్రభుత్వాన్ని దించి బీజేపీ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించాలన్న తొందరలో ఉన్నట్లున్నారు అన్నామలై. కొరడాతో ప్రారంభమైన



ఈ స్వీయ శిక్ష ఎక్కడిదాకా వెళుతుందోనన్నదే ఇప్పుడు లోకం బాధ. దక్షిణాదిలో అన్నిరాష్ట్రాల్లో పాగా వేయడానికి దారులు వెతుక్కుంటున్న బీజెపి ఎప్పటికైనా తమిళనాడులో కమలాన్ని వికసింపచేయడానికి అన్నామలై చేతికి కొరడా ఇచ్చిందా ఏమిటి? లేకపోతే ఖండించి ఉండేది కదా! పూర్వపు రాజుల కథల్లో దెబ్బలు తినడానికి అద్దె పిల్లలు ఉండేవారు. ప్రస్తుత ప్రజాస్వామ్య సంవిధానంలో పార్టీ అధ్యక్షులే దెబ్బలు తినాలేమో! అది కూడా వారిని వారే కొట్టుకోవాలేమో!

అన్నామలై గారూ! కొంచెం కుదుటపడి మొన్న మొన్నటి మీ పార్టీ చరిత్ర చదవండి. పార్లమెంటులో మీ బీ జె పి రెండు సీట్లనుండి మూడుసార్లు వరుసగా అధికారంలోకి ఒక్క కొరడా దెబ్బ కూడా కొట్టుకోకుండానే వచ్చింది. కొరడా పక్కన పడేయండి సార్! మీరు కొట్టుకుంటుంటే మాకు వాతలు తేలుతున్నాయి. తట్టుకోలేము.

-పమిడికాల్వ మధుసూదన్

## వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



(సత్యంన్యూస్, నరసన్నపేట)

శ్రీకాకుళంకు మంచి కీర్తిప్రతిష్టతలు తెస్తామని నృత్య శిక్షకురాలు జక్కువ అవంతిక సోమవారం అన్నారు. శుక్రవారం నుండి జరుగుతున్న కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిసాయి. క్రిష్ణాజిల్లా కూచిపూడి గ్రామంలో వైభవంగా ప్రారంభమైన అంతర్జాతీయ నాట్య సమ్మేళనం ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఏభై అడుగుల హస్తముద్రికల స్తూపాన్ని నిలిపి, కూచిపూడి నాట్య జెండాను ఆవిష్కరించారు. ఉత్సవాలలో భాగంగా శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట మండలం, పోలాకి గ్రామానికి చెందిన (అవంతిక బృందం) "శ్రీ సాయి నటరాజ నృత్యానికేతన్ విద్యార్థినిలు పాల్గొని తమ నృత్యాలతో అలరించారు. ఇందులో భాగంగా అవంతికా బృందానికి స్థానిక ఎమ్మెల్యే సత్కరించి, జ్ఞాపికను అందించి నంతరం నటరాజ నృత్యానికేతన్ గురువు అవంతికా మాట్లాడుతూ కూచుపూడిలో తమ చిన్నారులు పాల్గొనటం ఆనందంగా ఉందని, తమకు ఈ అవకాశమిచ్చిన కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కళలకు శ్రీకాకుళం పుట్టినిల్లని, ఎంతోమంది నృత్య కళాకారులున్నా అవకాశం తమకు రావటం మాటలకందని ఆనందాన్నిచ్చిందన్నారు. తమ గురువులు కీర్తిప్రియ, సత్యబాను, హరి రామమూర్తిలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. అలాగే కన్న తల్లితండ్రులు తమ మీద నమ్మకంతో ఇష్టమైన నృత్య కళారంగానికి ప్రోత్సాహించటం మరువలేనిదన్నారు. అవకాశాలు అందరికీ రావని, వచ్చినప్పుడే సద్వినియోగం చేసుకోవాలని, అవకాశాలు వస్తే తప్పకుండా శ్రీకాకుళంకు మంచి కీర్తి ప్రతిష్టతలు తెస్తానని ఈ సందర్భంగా తెలిపారు. అవంతిక బృందంలో చిన్నారులను ఈ సందర్భంగా పలువురు వక్తలు అభినందించారు.

## బొకేలు, పూలమాలలు, దుశ్శాలువలు తీసుకురావద్దు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే అభిమానులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పూలబొకేలు, గజమాలలు, పూలదండలు, దుశ్శాలువలు తీసుకు రావద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తనకు నిండుమనస్సుతో అభిమానంతో శుభాకాంక్షలు చాలు అని పేర్కొన్నారు. బొకేలు, పూలమాలలు, దుశ్శాలువలు తెచ్చే వారు అదే ఖర్చుతో "చదువుకునే పేద విద్యార్థులకు" ఉపయోగపడే విధంగా పుస్తకాలు, పెన్నులు అందించాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.

## చిరంజీవినాగ్‌కు ఎమ్మెల్సీ బొత్స పరామర్శ

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

మాజీ స్పీకర్, వైకాపా శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గం పరిశీలకులు తమ్మినేని సీతారాం తనయుడు యువనేత చిరంజీవి నాగ్‌కు, ఇటీవల హైదరాబాదులో శస్త్రచికిత్స జరిగిన విషయం విధితమే. రెండురోజుల క్రితం స్వగృహం ఆమదాలవలసకు చేరుకున్న చిరంజీవి నాగ్‌ను, శాసనమండలి విపక్షనేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మునుపటిలా ప్రజాక్షేత్రంలో పార్టీ కార్యక్రమాల్లో ముఖ్యభూమిక పోషించాలని కోరారు. ప్రస్తుతం పార్టీ స్థితిగతులతోపాటు, భవిష్యత్తులో అనుసరించాల్సిన చర్యలపై, స్పీకర్ తమ్మినేని సీతారాంతో ఎమ్మెల్సీ బొత్స చర్చించారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

## ఐక్యత చాటండి.. లక్ష్యాన్ని సాధించండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఐక్యత చాటడం ద్వారా లక్ష్యాన్ని సాధించుకోవడం సులువవుతుందని ట్రేడ్ యూనియన్ జేఏసీ నాయకులు, ఎండియూ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు టి.తిరువతిరావు అన్నారు. ఎండియూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ అధ్యక్షతన స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం జరిగిన ఎండీయూ ఆపరేటర్ల జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ప్రధానవక్తగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ కార్మిక సంఘంగా ఎండియూ ఆపరేటర్ల సంఘం రూపొందడం అభినందనీయమన్నారు. మారుమూల పల్లెల్లో ప్రజలకు నిరంతరం సేవలందించే ఎండియూ ఆపరేటర్లకు ప్రభుత్వపరంగా అందుతున్న గౌరవవేతనం నామమాత్రమేనని, పెరుగుతున్న ధరలు అవసరాల మూలంగా వేతనాలు పెంపుదల, పలు సౌకర్యాల కల్పన చేయాలన్నారు. ఎండీయూ ఆవరేటర్ల సంఘం గత నాలుగేళ్లుగా ఎన్నో పోరాటాలు సాగించి ఫలితాలు సాధించిందని, అదే స్ఫూర్తితో ముందుకు సాగేందుకు తమ సహకారం ఉంటుందన్నారు. పోరాటాల జిల్లాగా పేరొందిన శ్రీకాకుళం నుంచి అసోసియేషన్ ఏర్పడడం, ట్రేడ్ యూనియన్‌గా ఆవిర్భవించడం శుభవరిణామమని, ఇందులో రౌతు సూర్యనారాయణ కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ ఎండియూ ఆవరేటర్ల సంఘం హక్కుల కోసం పోరాడుతూనే బాధ్యతలు విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. నాలుగేళ్ళ క్రితం అసోసియేషన్‌గా ఏర్పడి రాష్ట్రంలోనే మొట్టమొదటి ఎండియూ ట్రేడ్ యూనియన్‌గా ఆవిర్భవించడం మంచి పరిణామమన్నారు. గ్రామీణ ప్రజలకు నిత్యం నిత్యావసర సరుకులు అందించడంలో కీలకపాత్ర పోషించే ఆపరేటర్ల జీవితాల్లో వెలుగు నింపిందుకు పాలకులు సహకారం అవసరమన్నారు. అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషి చేయాలన్నారు. సూర్యనారాయణ ఏ రంగంలో ఉన్న తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకోవడం మొదట నుంచి అలవర్చుకున్నారని ఆయన చేసే కృషికి ఎంతో అభినందనీయమని తెలియజేస్తూ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎండియూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఆపరేటర్లు సంఘటితంగా పని చేస్తున్నారని, దీని మూలంగానే నాలుగేళ్లలో ఎన్నో పోరాటాలు సాగించి విజయాలు సాధించామన్నారు. మెళియాపుట్టి మండలంలో ఓ నిరుపేద ఆపరేటర్ మరణిస్తే అసోసియేషన్ రూ.70వేలు సహాయం అందించిందని, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ సమస్యను అసోసియేషన్ తీసుకెళ్లినా త్వరితగతిన పరిష్కరిస్తున్నారన్నారు. ఎండియూ ఆపరేటర్లకు సంబంధించిన సివిల్ సప్లై ప్రభుత్వ శాఖ అధికారులు అందిస్తున్న సహకారానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమస్యలపై పోరాడుతూనే ఉద్యోగ బాధ్యతలు ప్రతి ఒక్కరు విజయవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని నియోజకవర్గాలు, మండల కేంద్రాలకు నాయకత్వం వహిస్తున్న ప్రతినిధులను ఆయన సభకు పరిచయం చేశారు. అనంతరం ప్రతినిధులందరికీ అతిధులు చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు జి.హిమంత్, కె.నవీన్, జిల్లా కార్యదర్శి దోర గోపి, సహాయ కార్యదర్శులు ఎల్లవ్వలనాయుడు, డి.వాను, కోశాధికారి సింహులు, సోషల్ మీడియా ఇన్‌చార్జి బొట రామారావు, ఎచ్చెర్ల, ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు డి.దామోదర్, జి.బాలకృష్ణ, కె.సంతోష్, ఎన్.వెంకటరావు, జిల్లా కార్యవర్గసభ్యులు మోహన్, కె.అవ్వలనాయుడు, రామారావు, గోవిందరాజు, విశ్వనాథం, నీలకంఠం, కార్తీక్, కెంబూరి అప్పలనాయుడు శ్రీనివాసరావు, ఉమా శంకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర భాషోపాధ్యాయసంస్థ శ్రీకాకుళం జిల్లాశాఖ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ వార్షిక క్యాలెండర్‌ను కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లానేతలు పలు సమస్యలను కేంద్ర మంత్రి ముందు ఉంచారు. గత ప్రభుత్వం తెలుగు మాధ్యమాన్ని ఎత్తివేస్తూ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాల వల్ల లక్షలాది విద్యార్థులు విద్యకు, వికాసానికి దూరమవుతున్నారని నేతలు కేంద్రమంత్రి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు. 2019నుంచి డీఈవో పూల్‌లో ఉంటూ అభద్రతకు, వివక్షకు గురవుతున్న భాషా పండితులకు పదోన్నతులు కల్పించేలా చొరవ చూపించాలని కేంద్ర మంత్రికి విన్నవించారు. పాఠశాల విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన జీవో నెంబర్ 117ను తక్షణమే రద్దు చేసి పాఠశాల విద్యావ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలని వారు కోరారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖలో అన్ని సమస్యలపై తనకు అవగాహన ఉందని, రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచే స్తుందని, అన్ని సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని కేంద్రమంత్రి చెప్పారు. ఈ సమావేశంలో సంస్థ అధ్యక్ష,ప్రధాన కార్యద ర్శులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు, రఘుపాత్రుని శ్రీనివాసరావు, గొడబ మేరీప్రసాద్, అరసవల్లి గణపతిరావు, బి.రామ చంద్రరావు, రాడ గణపతిరావు, కుప్పన్నగారి శ్రీనివాసరావు, లోలుగు ప్రసాద్, రొంపివలస రామారావు, రుప్ప తులసీదాసు, గంగ్రేటి వినయ్ కుమార్, చాడ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు


















# రాజు గారి గారడి

(మొదటిపేజీ తరువాయి)

నగల మాయంతో పాటు నరసన్నపేట బజారు బ్రాంచిలో నకిలీ రుణాల కుంభకోణం, శ్రీకాకుళం మెయిన్ బ్రాంచిలో కూడా అటు వంటి లీలలే వెలుగుచూసినా కూడా రాజు మీద శాఖాపరమైన చర్యలకు ఇంతవరకు ఎస్‌బీఐ ముందుకు రాలేదు.

గార బ్రాంచిలో బంగారు నగలు మాయమైన తర్వాత అందుకు అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న స్వప్నప్రియే కారణమని టీఆర్ఎం రాజు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కానీ బ్యాంకు లాకర్ ఓపెన్ చేయాలంటే ఇద్దరు క్యాష్ ఆఫీసర్ల వద్ద తాళం ఉంటుందని, కేవలం స్వప్నప్రియ వద్ద ఉన్న తాళంతో తెరిస్తే లాకర్ ఓపెన్ కాదని, మరో క్యాష్ ఆఫీసర్‌గా ఉన్న సురేష్ ప్రమేయం కూడా ఇందులో ఉంటుందనే అనుమానం 'సత్యం' తన కథనం ద్వారా వ్యక్తం చేసిన తర్వాత సురేష్ తనపై దాడి జరిగిందనే నాటకాన్ని రెండు రోజులు రక్తికట్టించి, ఆ తర్వాత అట్నుంచి అటే ముందస్తు బెయిల్ తెచ్చుకోవడం కోసం విజయవాడ పరారయ్యారు. దీంతో గత్యంతరం లేక సురేష్ అంటుబాటులో లేకపోవడంతో పోలీసులు తమ ఎఫ్ఐఆర్‌లో సురేష్ పేరును చేర్చారు. కానీ టీఆర్ఎం రాజు ఇచ్చిన ఫిర్యాదులో మాత్రం ఎక్కడా సురేష్ ప్రస్తావన అప్పట్లో లేదు. ఇప్పుడు కూడా సురేష్ లేదా స్వప్నప్రియ సెలవు పెట్టిన రోజుల్లో లోకనాథం అనే క్యాషియర్ క్యాష్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. గార బ్యాంకు లాకర్‌లో ఉండాల్సిన నగలు మాయమైనప్పుడు లోకనాథం కూడా క్యాష్ ఆఫీసర్‌గా ఉన్నారని, అలా 73 సందర్భాల్లో ఆయన క్యాష్ ఆఫీసర్‌గా వ్యవహరించారని, అదే సమయంలో ఓ రోజు మూడు బంగారు బ్యాగులు మిస్సయ్యాయని బ్యాంకు ఉన్నతాధికారులు గుర్తించారు. ఇందులో భాగంగానే ఈ ఘటన వెలుగులోకి వచ్చిన 10 రోజుల్లోనే లోకనాథంను సస్పెండ్ చేశారు. పది రోజుల క్రితమే ఆయనకు మళ్లీ పోస్టింగ్ ఇచ్చారు. ఇంత జరిగినా ఎక్కడా ఈ విషయాన్ని స్టేట్‌బ్యాంకు అధికారులు ఇప్పటికీ పోలీసుల దృష్టికి తీసుకురాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్వప్నప్రియ కేసును పునర్విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. స్వప్నప్రియ తల్లి ముఖ్యమంత్రి గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేయడంతో స్వయంగా చంద్రబాబునాయుడే ఈ కేసులో వాస్తవాలు వెలికితీయాలని జిల్లా పోలీసులకు ఆదేశించారు. ఈ మేరకు గత నాలుగు నెలలుగా ఇందుకు సంబంధించిన పూర్వపరాలపై పోలీసులు విచారిస్తున్నారు. ఇందులో భాగంగానే అప్పటి ఆర్ఎం రాజును, ఆడిటర్లను, లీగల్ ఆఫీసర్లను కూడా పోలీసులు విచారించారు. కానీ ఎక్కడా ఇదే కేసులో లోకనాథంను సస్పెండ్ చేసినట్లు గాని, ఆయన కొద్ది రోజులు క్యాష్ ఆఫీసర్‌గా వ్యవహరించారని గాని చెప్పకపోవడం చూస్తే ఎస్‌బీఐకి ప్రత్యేకమైన రాజ్యాంగం ఏమైనా ఉందా అన్న అనుమానం కలగకమానదు. ఇంతవరకు స్వప్నప్రియే బంగారాన్ని మాయం చేసిందని చెప్పుకొచ్చిన ఎస్‌బీఐ ఆర్ఎం రాజు ఆ తర్వాత సురేష్‌తో పాటు మరికొందరి పేర్లు చేర్చాల్సిన అగత్యం ఏర్పడింది. ఇప్పుడు లోకనాథం అనే కొత్త కేరక్టర్ ఎంటరవడంతో కథ మరో మలుపు తీసుకుంది.

# విద్యార్థి దశలోనే పారిశ్రామిక శిక్షణ అవసరం



(సత్యంన్యూస్, నరసన్నపేట)

కళాశాల స్థాయి నుంచి విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా వారికి శిక్షణ అందించడం ఆహ్వానించదగిన పరిణామమని స్థానిక మండల అధికారి బి.మధుసూదనరావు అన్నారు. సోమవారం పద్మావతి డిగ్రీ కళాశాలలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్మెంట్ (నీస్బుడ్) వారు నిర్వహించిన వారం రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసిన సందర్భంగా విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసి వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కళాశాలలు తీసుకోవాలని అన్నారు. స్టార్టప్ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫార్మా అగ్రికల్చర్ మేనేజ్మెంట్ రంగాలను కళాశాలలతో అనుసంధానం చేయడం ద్వారా సమాజానికి అవసరమైన అనేక ఆవిష్కరణలను విద్యార్థుల ద్వారా వెలికితీసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపీఓ కె.నాగమణి, వ్యవసాయ అధికారి కే.సునీత, కళాశాల డైరక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్, అకడమిక్ ఇన్‌ఛార్జి ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు కె.రాము, జీవన్ పాల్గొన్నారు.


# పేరు మార్చబడినది

**గడిదేశి చిన్నమ్మడు** D/o తవుడు అను నేను వివాహము జరిగిన తర్వాత **వంజరాపు నాగమణి** W/o వి.సూర్యనారాయణ, డోర్ నెంబరు 1-293, కొత్తూరుసవిరిగాం, గార మండలం, సతివాడ పోస్టు, శ్రీకాకుళం 532 001లో నివాసముంటున్నాను. కావున ఇకనుండి నేను నా పేరును **వంజరాపు నాగమణి** అనే పేరుతో అన్ని వ్యవహారాలను కొనసాగిస్తానని ఈ ప్రకటన ద్వారా తెలియజేస్తున్నాను.


# పవిత్రకు రాష్ట్రస్థాయిలో ఫస్ట్‌ప్రైజ్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రస్థాయిలో 23 జిల్లాలవారికి అమరావతిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థిని (బికాం ఫైనల్ ఇయర్ స్టూడెంట్) పి.పవిత్ర ప్రథమరాలిగా నిలిచింది. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వారోత్సవాలను నిర్వహించారు. దీనిలో భాగంగా కళాశాలలోని కామర్స్ విభాగం జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాస్థాయిలో పి.పవిత్ర ప్రథమంగా నిలిచింది. జిల్లా స్థాయిలో ప్రథములుగా వచ్చిన 23 జిల్లాలకు చెందిన వారికి అమరావతిలో మళ్లీ వక్తృత్వ పోటీ నిర్వహించారు. అక్కడ కూడా పి.పవిత్ర ప్రథమంగా నిలిచింది. పౌరసరఫరా శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా బహుమతిని అందుకుంది. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ అభినందిస్తూ 23 జిల్లాల వారితో పోటీపడి గెలిచి ప్రథమ స్థాయిలో నిలిచి శ్రీకాకుళం జిల్లాకు పేరు తెచ్చావంటూ పవిత్రను ప్రశంసించారు. బహుమతిగా సర్టిఫికెట్, మెమెంటో, రూ.7వేలు నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు పవిత్రను ప్రశంసిస్తూ తమ కళాశాలకు ఎంతో గర్వకారణమని అభినందించారు. కళాశాల కామర్స్ శాఖాధిపతి ఎల్.కృష్ణారావు, వైస్ ప్రిన్సిపల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, ఐక్యుఎసి కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కళాశాలలోని అధ్యాపకులు పవిత్రను అభినందించారు.

# కోటిదీపాల కాంతుల్లో కళకళలాడిన మున్సిపల్ మైదానం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలో నిర్వహించిన అష్టలక్ష్మి పుష్పయాగ సహిత కోటి దీపోత్సవం కోటిదీపాల కాంతుల్లో కళకళలాడింది. ఆధ్యాత్మికతకు నిలయమైన నాగావళి నదీతీరాన అపురూపమైన ఆధ్యాత్మిక ఘట్టం రూపుదిద్దుకుంది. నగరంలోని ఎన్‌టీఆర్ మున్సిపల్ మైదానంలో ఆదివారం శ్రీ అష్టలక్ష్మి పుష్పయాగ సహిత కోటి దీపోత్సవం అద్భుతంగా నిర్వహించారు. గోపూజలతో ప్రారంభమైన కార్యక్రమం విఘ్నేశ్వర పూజ, పుణ్యావహచనం, అష్టలక్ష్మి అమ్మవారి ఆవాహనం, మంత్రపుష్పం, మంగళ హారతుల నడుమ శ్రీ శృంగేరీ మఠం శంకర్ తత్వ ప్రసార అభియాన్, శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య భక్త సమాజ వ్యవస్థాపకులు బంగారయ్యశర్మ ప్రవచనం భక్తులు మనసులను పరవశింపజేసింది. ఏక కాలంలో 86 శివలింగాల్లోని కోటి జ్యోతులు వెలుగుతున్న సమయాన ఇల కైలాసాన్ని తలపించింది. కోటి దీపోత్సవం గొప్ప సంకల్పమని కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రశంసించారు. అనంతరం మంగళహారతి, అమ్మవార్ల నిమజ్జనంతో కార్యక్రమం ముగిసింది.

కోటి దీపోత్సవం నిర్వహణ ఆలోచన చేసిన విజయగణపతి ఆలయ ప్రధాన అర్చకులు పెంట శ్రీధర్, ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ, శర్మలను కేంద్రమంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రథసప్తమిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ మూడు రోజుల పాటు వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి సతీమణి శ్రావ్య, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, స్వాతి దంపతులు, అంధవరపు సంతోష్ దంపతులు, ప్రసాద్ దంపతులు, మెట్ట సుజాత, వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం అర్చకులు ఆరవెల్లి చంద్రశేఖరశర్మ, పెంట నగేష్‌శర్మ, ఆరవెల్లి ఫణికుమార్‌శర్మ, కస్తూరి సంతోష్ కుమార్, దూసి నాగు తదితరులు పాల్గొన్నారు.



# కళింగ కవులకు దళిత స్పృహ పెరగాలి



(సత్యంన్యూస్, రాజాం)

ఇతర తెలుగు నేలలో దళిత స్పృహతో కవిత్వం వచ్చినంతగా కళింగ నేలలో రాకపోవడం శోచనీయమని సాహితీ ప్రముఖులు పిల్లా తిరుపతిరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 119వ నెలవారీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తిరుపతిరావు 'కళింగాంధ్ర దళిత కవిత్వం' అనే అంశంపై ముఖ్య ప్రసంగం చేశారు. ఇతర ప్రాంతం కంటే వెనుకబడిన కళింగాంధ్రలో దళిత కవిత్వం కూడా వెనుకబడిందని ఆయన విశ్లేషించి చెప్పారు. పద్మశ్రీ తిమోతి జ్ఞానానంద కవి పద్యసాహిత్యానికి చెందిన దళిత కవి కాగా, కళింగంలో ఇంకొకరెవరూ లేకపోవడం బాధాకరమన్నారు. గురజాడ, గరిమెళ్ల సత్యనారాయణ వంటి ఒకరిద్దరు దళితేతరులు తొలి రోజుల్లో ఆధునిక దళితకవిత్వం రాశారని వివరించారు. కళింగ నేలలో పాట ద్వారా ప్రఖ్యాతుడైన వంగపండు ప్రసాదరావు గొప్ప దళిత సాహిత్యాన్ని సృష్టించాడని చెప్పారు. దళితేతర కవులు గంటేడ గౌర్నాయుడు, సిరికి స్వామినాయుడు, కంచరాన భుజంగరావు తదితరులు దళిత కవిత్వం రాస్తున్నారని వివరించారు. కలమట దాసుబాబు మాత్రం అణిచివేతను అనుభవించిన దళితకవిగా దళితుల గొంతును బాగా వినిపిస్తున్నారని, కళింగం నుంచి ఇంకా విస్తారంగా దళిత సమస్యలపై కవిత్వం రావాలని తిరుపతిరావు ఆకాంక్షించారు. అనంతరం వేదిక సభ్యులు తిరుపతిరావును ఘనంగా సన్మానించారు. సమతం మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, రౌతు గణపతిరావు నాయుడు, ఒమ్మి రమణమూర్తి, ఉరిటి గున్నేశ్వరరావు, పడాల కవీశ్వరరావు, రాజాపు శాంతారావు, ఆల్తి మోహనరావు పొదిలాపు శ్రీనివాసరావు, శాసపు సత్యనారాయణ, పోలాకి ఈశ్వరరావు, గ్రంధి సాయిసూర్యారావు, అంబల్ల రామ్మూర్తి, అమనాన నాగేశ్వరరావు, వల్లూరు రామినాయుడు, దన్నాన రామారావు, నల్లపాటి రాజశేఖర్, చేబ్రోలు జయరాజు, పి.గోవింద తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు లావాదేవీలపై అవగాహన

(సత్యంన్యూస్, నరసన్నపేట)

బ్యాంకు లావాదేవీలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ చెల్లింపులపై అవగాహన కలిగి ఉండాలని ఎస్.బీ.ఐ. నరసన్నపేట మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ డి.మధుసూదనరావు తెలిపారు. వ్యక్తిగత సమాచారం, ఓటీపీ, ఆధార్ నెంబర్ల కోసం బ్యాంకు అధికారుల నుంచి ఎలాంటి ఫోన్‌కాల్స్ రావనీ గుర్తించాలన్నారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అకౌంటింగ్ అండ్ టేక్సేషన్ విద్యనభ్యసిస్తోన్న విద్యార్థులకు ఆన్ ది జాబ్ శిక్షణలో భాగంగా బ్యాంకు లావాదేవీలపై బ్యాంకులోనే ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. వృత్తి విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులకు నెలరోజుల పాటు వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిజ్ఞానం పొందేలా డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు ఆదేశాలతో ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ సూచనల మేరకు క్షేత్రస్థాయి శిక్షణ ఇస్తున్నట్లు అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి తెలిపారు.

బ్యాంకింగ్ రంగంలో వస్తోన్న మార్పులు, డిజిటల్ బ్యాంకింగ్, వివిధ రకాల దరఖాస్తులు నింపడం, డిపాజిట్, డబ్బులు బట్వాడా చేయడం, నెఫ్ట్, ఆర్టీజీఎస్ ద్వారా నగదు బదిలీ చేయడం వంటి అంశాలపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సందేహాలను చీఫ్ మేనేజర్ నివృత్తి చేశారు.



# క్రీడాకారులకు సూరశ్రీను అభినందన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇటీవల ఉమ్మడి కాకినాడ జిల్లా పిఠాపురం కేంద్రంగా జరిగిన రాష్ట్ర సీనియర్ బాక్సింగ్ పురుషుల పోటీలలో జిల్లా నుంచి పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రముఖ పారిశ్రామికవేత్త, సమాజ సేవకులు సూర శ్రీనివాసరావు అభినందించారు. జనవరి మూడో తేదీ నుంచి ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి పథకాలతో తిరిగి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించిన క్రీడాకారులతో పాటు జిల్లా బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

# 'కర్లెమ్మ' భూపంచాయితీ ఇంకెన్నాళ్లు?



(సత్యంన్యూస్, కొత్తూరు)

కర్లమ్మ పంచాయతీ భూమి పంచాయితీలు ఇప్పటికీ తీరలేదు. ఈ రెండు నెలల కాలంలో ఏ సమస్యకూ పరిష్కారం కానరావడంలేదు. రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. తమ వేదన అధికారులకు పట్టడంలేదని రైతులు వాపోతున్నారు. గ్రామసభలతో తూతూ మంత్రంగా తమను మభ్యపెట్టడానికే ప్రభుత్వ భూములను జిరాయితీ భూములుగా మార్చినట్టు చూపుతున్నారని, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా తమ సమస్యలు పరిష్కారం కావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఇబ్బందులు పట్టించుకోవడంలేదని, ఈ విషయంలో అధికారుల శైరి నిమ్మకు నీరత్తినట్టు ఉందని విమర్శిస్తున్నారు. ఇన్‌ఛార్జి వీఆర్వో, లేదా పూర్తిస్థాయి వీఆర్వోను వేయడంలో అధికారులు ఎందుకు జాప్యం వహిస్తున్నారో అర్థం కావడంలేదని రైతులు అంటున్నారు. అధికారులు చేసిన తప్పులకు ప్రజలకు తిప్పలు తప్పడంలేదని, ఈ భూ సమస్యల పరిష్కారం ఎప్పుడని కర్లెమ్మ రైతులు ఎదురుచూస్తున్నారు.

# రాహుల్‌కు వడ్డాది పాపయ్య స్మారక పురస్కారం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రముఖ చిత్రకళాకారుడు రాహుల్ పట్నాయక్‌కు వడ్డాది పాపయ్య(వపా) స్మారక పురస్కారం లభించింది. విశాఖపట్నం చిత్రకళాపరిషత్ ఆదివారం కంచరపాలెం బి.ఎన్.ఆర్. భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేసి రాహుల్ పట్నాయక్‌ను సన్మానించారు. ఒకే చట్రంలో వడ్డాది పాపయ్య గీచిన వంద చిత్రాలను సూక్ష్మీకరించి అందంగా తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో వపా వర్థంతిని పురస్కరించుకుని ఆయన లోగోతో ఉన్న రజిత ఉంగరాన్ని కూడా రాహుల్‌కు బహుకరించారు. విశాఖ చిత్రకళాపరిషత్ కార్యదర్శి సుంకర చలపతి రావు, జి.వి.ఎం.సి వైద్యాధికారిణి డాక్టర్ పి.హేమలత, విశాఖ వ్యాలీ రోటరీ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఆర్.నందకిశోర్, బిఎన్ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి బి.ఆర్.జి.రాజు, చిత్రకళాపరిషత్ సంయుక్త కార్యదర్శి డి.శ్రీనివాసమనోహర్ తదితరులు రాహుల్‌ను సత్కరించారు.




# న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవట్లేదు

- మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడంలేదని, ఎవరూ శుభాకాంక్షలు చెప్పడానికి తన నివాసానికి రావద్దని మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణించిన నేపథ్యంలో సంతాప దినాలు పాటిస్తున్నానని, ఇందులో భాగంగానే న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవడంలేదని, అభిమానులు, శ్రేయోభిలాషులు, సహచరులు తనను వ్యక్తిగతంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసేందుకు రావద్దని ఆ ప్రకటనలో కోరారు. తాను కూడా అందుబాటులో ఉండనని ఆయన తెలిపారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.